

# మూడో సీతకథ

బ్రాహ్మణ పిల్ల

– భువనచంద్ర



(గత సంచిక తరువాయి)

-3-

**ముత్యాలోడి ముల్లె**

ఇప్పుడంటే పిల్లలు గాడిద బరువులు మోస్తున్నారు గానీ, మేం మాత్రం పాకబడిలోగానీ హైస్కూల్లోగానీ అటువంటి దిక్కుమాలిన పని చెయ్యలేదు. పీరియడ్స్‌ని బట్టి పుస్తకాలుంటే చాలు. మిగతా రాతపనికి ఒక్క ‘చిత్తుబుక్కు‘ ఉంటే చాలు.. అన్నీ అందులోనే ఎక్కించి, ఇంటికెళ్ళాక నోట్సుల మీదకి తిరగరాసేవాళ్ళం.

అట్లాగే స్కూలు బేగులూ, టిఫిన్ బాక్సులూ, వాటర్ బాటిళ్ళూ ఇవన్నీ జాన్తానై. ఓ ఖాకీ గుడ్డతో కుట్టించిన మందపాటి సంచీ వుండేది. పుస్తకాలూ పెన్సిళ్ళూ అన్నీ దాన్లోనే. ఆ సంచిని భుజానికి తగిలించుకుని నడిచేవాళ్ళు కొందరైతే, ఆ సంచిని ఓ కర్రకి తగిలించి, ఆ కర్రని భుజం మీద చేపలగాలంలాగా పెట్టుకుని హుషారుగా నడిచే పిల్లలు ఇంకొందరు.

ఓ చిన్న సత్తు డబ్బాలో ‘భోజన పదార్థాలు‘ ఉండేవి. అవి మాలాంటి ‘లోకల్స్‘ తీసికెళ్ళేవాళ్ళం కాదు. భట్టారిగూడెం నించీ, ఫాతిమాపురం (అడ్డురోడ్డు) నించీ వచ్చే పిల్లలు ఆ సత్తు బాక్సుల్లో మధ్యాహ్నభోజనం తెచ్చుకునేవాళ్ళు. ఫుడ్ ఏవుంటుందీ.! పెరుగు కలిపిన ఆవకాయ అన్నమో, మాగాయ అన్నమో, ఓ ఆవకాయ ముక్క వేసిన పెరుగన్నమో ఉండేది.

ఇంకొంతమంది సరదాగాళ్ళయితే మధ్యలో కొంచెం సేపు ఆగి, రేక్కాయిలూ, సెనక్కాయిలూ, సీజన్‌లో వేరుసెనక్కాయిలూ, పుల్ల పుల్లగా తియ్యతియ్యగా ఉండే పరిక్కాయలూ సేకరించి తెచ్చేవాళ్ళు.

మేమైతే మదర్స్ చూడకుండా కాస్త కారం మరికొంచెం ఉప్పూ కలిపిన రెడీమేడ్ మిక్చర్ తెచ్చుకునేవాళ్ళం. మావిడికాయల సీజన్‌లో మామిడి ముక్కల మీద యీ ఉప్పూ కారం మిక్చరు జల్లి తింటుంటే... దాన్నిగదరగా... ఎంతమజానో!

అలాగే రేక్కాయల్ని చిదిమి.. మిక్చర్‌లో దొర్లించి నోట పెట్టుకుంటే.. ఆహా.. స్వర్గానందమేకదా!

ప్రస్తుతం మా అందరికళ్ళూ భట్టువారిగూడెం నించి వచ్చే ముత్యాలోడి సంచిమీదున్నై. వాడి పూర్తిపేరు ముత్యాలసత్యన్నారాయణ.

వాడు నిస్సందేహంగా చాలా ‘మంచివాడు‘. వాడు మంచివాడుగా మిగిలిపోవటానికి ఓ బృహత్తరమైన కారణం వుంది. ఏ చిన్న ‘చెడ్డ‘ పనిచేసినా వాళ్ళనాన్న నిర్దాక్షిణ్యంగా వాడి చెమడాలు ఎక్కదీసేవాడు. ఆ భయంతో ముత్యాలోడు (ఇప్పటికీ) మంచివాడుగా చరిత్రలో నిలబడిపోక తప్పలేదు.

క్లాసులో ఎవడు రేక్కాయిలూ మామిడికాయలూలాంటివి తెచ్చినా మిగతావాళ్ళకీ వాటిమీద కాస్తో కూస్తో ‘హక్కు‘ ఉంటుంది కదా!

‘పక్కవాడికి పెట్టకుండా తినేవాడికి పంచమహాపాతకాలు చుట్టుకుంటై‘ అనేమాట అటు వేదాల్లోనూ ఇటు బైబిల్లోనూ పెద్దవాళ్ళు ‘రాసే‘ ఉంచారుగదా! మేం కొద్దో గొప్పో వాటిని రుచిచూడకపోతే, ఆ యొక్క మనిషి పంచమహాపాతకాలూ చుట్టుకున్న వాడై శాశ్వత నరకాన్ని పొందుతాడుగదా! అలా పొందకుండా, అంటే, నరకం బారిన పడకుండా వుండాలంటే మేము వాడు తెచ్చుకున్నది

'సంగ్రహించి' అయినా వాడ్ని రక్షించాలిగదా! అందుకే మా కళ్ళు ముత్యాలోడి సంచిమీద వున్నై. ఆ సంచిలో 'బాక్సు' ఉన్న దాఖలా కనబళ్ళా. ఏదో మూటలాంటిది వున్నట్టు సంచియొక్క 'ఉబ్బు'ని కనిపెట్టాం.

వాడూ అతి జాగ్రత్తగా ఆ సంచిని ఒళ్ళో పెట్టుకునే బెంచిమీద కూర్చున్నాడు గానీ. ఒక్క క్షణమైనా ఆదమరచి పక్కన పెట్టలా.

మా క్లాసులో అంటే ఫస్టుఫాం 'A' సెక్షన్‌లో చాలామంది 'స్మెల్లర్స్' వున్నారు. అంటే పోలీసుల దగ్గరుండే 'డాగ్‌స్క్వాడ్' మాదిరిగానన్నమాట. జేబులోగానీ, సంచీల్లోగానీ వున్న తినుబండారాలని దూరం నించే 'వాసన' పట్టి కనిపెట్టడంలో వీళ్ళు ఉద్దండులన్నమాట.

అరచెయ్యి వాసన చూసి అన్నంతోపాటు ఏ 'కూర' తిన్నారో చలాగ్గా చెప్పగలరన్నమాట. అటువంటి వాళ్ళుకూడా ఇవ్వాళ ముత్యాలోడి సంచిలో ఏముందో కనిపెట్టలేకపోయారంటే, మా కుతూహలం ఏ 'రేంజి'కి పెరిగి ఉంటుందో మీరే ఊహించండి.

"కామ్రేడ్ జోగారావ్.. ముత్యాలోడి సంచిలో వున్నది రేక్కాయలమూట. రెండు విల్సుపేకెట్లు పందెం!" అన్నాడు కామ్రేడ్ నాగరాజు. (విల్సు పేకెట్లంటే సిగరెట్లు వున్నదికాదు.. ఖాళీడొక్కులు.. బెచ్చాలాటకి అవుండాలి.)

"నేను ఇరవై 'పాసింగ్ షో' డొక్కులు పందెం కడుతున్నా కామ్రేడ్ జయలక్ష్మీ, అవి నానబెట్టిన సెనగలు!" నమ్మకంగా అన్నది కామ్రేడ్ పుష్పకుమారి.

"ఉహూ..! శనగల్ని నానబెట్టాక ఛెడ కంపుకొడతై.. అందులో వున్నవి వేయించిన వడియాలు. నా ఎర్రరిబ్బన్ పందెం!" ఛాలెంజ్ చేసింది కామ్రేడ్ విజయలక్ష్మి.

"వడియాలైతే నూనె వాసనని ఇట్టే పట్టొచ్చు.. అవి వొడియాలు కావు!" డిక్లేర్ చేశాడు ఘంటా గంగాధరం. వాడూ పేరొందిన 'స్మెల్లర్స్'లో ఒకడు.

"అవును.. నూనె వాసన పట్టడం చాలా తేలిక!" ఒప్పుకున్నాడు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఉపాధ్యాయుల సుబ్బయ్య. వాళ్ళ పెదనాన్న స్వాతంత్ర సమరయోధుడూ మరియూ కాంగ్రెస్ నాయకుడూనూ.

"పోనీ వాడ్నే అడిగితే?" సజెస్టు చేసింది కామ్రేడ్ సత్యమన్మధ రోజా పుష్పకుమారి.

"ఛీ.. అంతకంటే అవమానం మరోటి వుంటుందా? ఏం? మన ముక్కులు పుచ్చిపోయాయా? మన పౌరుషం ఇంకిపోయిందా? ఆ మాత్రం కనిపెట్టకపోతే మన మానప్రాణాలెందుకు?" పిడికిలి బిగించి అన్నాడు కామ్రేడ్ జోగారావు.

మధ్యాహ్నం 'తిండి' బెల్లుకొట్టారు. వాడు దూరంగా పోయి సంచిలోంచి ఓ కాల్చిన వెలగపండుని బయటికి తీసి, చిన్న రాయితో పగలగొట్టి గుజ్జు పూర్తిగా తినేసి పంపుదగ్గర ఫుల్లుగా నీళ్ళు తాగాడు. నీళ్ళు తాగే టైమ్‌లో కూడా వాడు సంచిని వదల్లా. సాయంత్రం 'ఇంటి' బెల్లు కొట్టేదాకా మూట రహస్యం కనిపెట్టే 'ఛాన్స్' ఉన్నదికదా అని మేము సంబరపడ్డాం. ఒక్క నిముషం ఛాన్సు దొరికినా ఘనత వహించిన మా 'స్మెల్లర్స్' వాడి సంచి రహస్యం కనిపెట్టడానికి విశ్వప్రయత్నాలూ చేశారని 'ఘంటా'పథంగా చెప్పగలను. లాస్ట్‌బెల్లు కొట్టేశారు. ఇహ వాడు ఆ మూట విప్పడని మాకు అర్థం అయిపోయింది.

నిరుత్సాహంగా మా వాళ్ళతో బయల్దేరిన దాన్ని కాస్తా, కొంతదూరం వెళ్ళి, 'నాక్కొంచెం పనుందిరా.. మీరెళ్ళండి!' అని మిడిల్ డ్రాప్ అయిపోయి భట్టువారిగూడెం వైపు పరుగుతీశా. ఉహూ.! వాడు కనబడితేగా.!

ఉప్పరిగూడెంలో గునగునా నడుస్తున్న బుల్లిపందుల్ని చూసి, చాలాసేపు ఆనందించి, మళ్ళీ మా వూరివైపు తిరిగానో లేదో వాడు దూరంగా ఎదురొస్తూ కనిపించాడు. వాడు దగ్గరికి రాగానే వాడి చెయ్యి పట్టుకుని

"ఒరే సత్తినాణా.. మర్యాదగా మూటలో ఏం తెచ్చావో చెప్పు. లేకపోతే నూకాలమ్మ మీద ఒట్టు పెట్టేస్తా!" అని బెదిరించా.

వాడు కాసేపు చెప్పాలా వద్దా అని సందేహించి, "మా అమ్మ ఓ సేరు మినుముల్ని మూటగా కట్టిచ్చి జల్లిపల్లి తాతబ్బాయి దగ్గర అమ్మి నూకలు తెమ్మందే సీతా!" అన్నాడు.

"దానికంత గుట్టెందుకూ?" ఆశ్చర్యంగా అడిగాను.

"అవి మా చేలో పండినవే! అయినా, మా నాన్నకి తెలిస్తే అమ్మని చంపేస్తాడు. అందుకే దొంగతనంగా మూటకట్టి ఇచ్చింది. ఇంట్లో నూకలు కూడా లేవే. బియ్యం తెమ్మంటే మా నాన్న తిట్టి బయటికి పోయాడు. మినుములు అమ్మమని అమ్మంటే, 'గిట్టుబాటు' ధర వొచ్చేదాకా అమ్మనని మొండికేశాడు. అసలు నిన్నరాత్రి కూడా అన్నం తిన లేదే. గోగు ఆకుల్తో పండుమిరపతొక్కు వుప్పూ నంజుకుని తిన్నాం.. నేను మా అమ్మా!" తలొంచుకుని అన్నాడు ముత్యాలోడు. ఒక్కసారిగా నా కళ్ళల్లో నీళ్ళు తిరిగి భోరున ఏడ్చా. చాలాసేపు ఏడ్చి, "ఒరే ముత్యలోడా.. అట్టా ఎప్పుడూ చెయ్యకురా.. రేపట్నించీ నేనూ కేరేజీ తెస్తా. నాతో తిందుగాని. అంతేగానీ అట్టా పస్తులుండకురా!" అంటూ మళ్ళీ ఏడ్చా. ఆ మరుసటి రోజు ఆదివారం. మా నాన్నతో యుద్ధం చేసి మరీ మూడు బుల్లిగిన్నెల ఇత్తడి కారేజీ (లోపల కళాయి చేసింది) కొనేదాకా నాకు ముత్యాలోడే మళ్ళీ మళ్ళీ గుర్తుకొచ్చాడంటే నమ్మగలరా!

'ఎ'ఫర్ ఏపుల్... 'ఎస్'....ఫర్ సీతా.

"ఇవ్వాళ చుట్టాలొస్తున్నారు.. అల్లరి కట్టిపెట్టి బుద్ధిగా మసులుకో!" మా అమ్మ సోమవారం పొద్దున్నే నాకు వార్నింగ్ ఇచ్చింది. అంతేగాదు, "కేసులూ పాడూ అంటూ ఆ కోర్టులో కూచోక మధ్యాహ్నం ఇంటికి రండి.. లేకపోతే నాకు ఎంత అప్రదిష్టా!" అని మా నాన్నకీ వార్నింగిచ్చింది.

"వచ్చేది ఎవరూ?" పుస్తకాలు సర్దుకుంటున్నదాన్ని కాస్తా, కుతూహలంగా అడిగా.

"ముగ్గురు మామయ్యలూ, అత్తయ్యలూ పిల్లలూ అందరూ వస్తున్నారు. చాలా?" అందావిడ.

"అలాంటప్పుడు నేను బడికి వెళ్తే ఏం మర్యాద? నీకు సహాయం చేస్తూ ఇవ్వాళ ఇంట్లో వుంటా!" హాయిగా పుస్తకాలు పక్కన పడేసి అన్నాను.

"ఆ వెధవ్వేషాలు నా దగ్గరకాదు. నువ్వు కొంపలోవుంటే నాకు తలనెప్పిగానీ మరే సాయమూ వుండదు" డిక్టేటర్‌లా అంది మా భాగ్యమ్మ.

"అదికాదే! అవీ ఇవీ సర్దిపెడతా. నువ్వు వంట చేస్తుంటే సామాన్లు అవీ అందిస్తా. ఒక్కదానివీ కష్టపడటం ఎందుకూ?" ఆరిందాలా అన్నాను.

"నువ్వు మర్యాదగా బడికి పోతావా లేక నాలుగు తగిలించమంటావా?" ఒకే ఛాయిస్ ఇచ్చింది మా అమ్మ. ఏం చేస్తాం? నా ఐడియా నాది. చుట్టాలు వస్తున్నారంటే యావిడ ముందుగానే తినుబండారాలు చేసి అటకెక్కించి వుంటుండాలి. వాళ్ళవాళ్ళు వస్తున్నారంటే ఎన్ని స్పెషల్సు చేస్తుందో నాకు తెలీదు గనకనా? నిన్న సాయంత్రం ఇంకో మూడుసేర్లపాలు ఎక్కువడిగినప్పుడే నాకు 'డౌటు' వచ్చి వుండాల్సింది.

"ఊ..పద.. గుడ్లు మిటకరిస్తూ నావంక చూస్తావేం?" మరోసారి హెచ్చరించింది మా అమ్మ.

"పదండి నాన్నా.! ఇక్కడుంటే ఇంకేమంటుందో! చుట్టాలు యావిడకేగానీ మనకికాదుగా! ఆవిడ్నే చూసుకోనీ!" ఓ కామెంటు విసిరి గుమ్మంలోంచి బయటికి గెంతాను. లేకపోతే మళ్ళీ నా చెవులు ఏనుగు కర్ణాలు కావూ!

స్కూల్లో వున్నానన్నమాటేగానీ, చిత్తం అంతా ఇంటిమీదే ఆవడలు గారెలూ గ్యారంటీగా చేస్తుంది. పిల్లకాయలు కూడా వొస్తున్నారు గనక జంతికలూ, పంచదార పూరీలూ కూడా ఉంటై, పులిహోరా పాయసం తప్పనిసరి.

ఇన్నిన్ని రకాలు ఇంట్లో తయారవుతుంటే, నేను మాత్రం 'తల్లి నిన్నుదలంచి' పద్యం భట్టీ కొట్టాలా?! హే పరాత్పరా ఎంత అన్యాయం? పోనీ కేరేజీలో ఏమైనా పెట్టిందేమో! మనసు వుండబట్టక మెల్లిగా మేస్టారు చూడకుండా కేరేజీ విప్పాను. ఉహూ.! ఆవకాయన్నం పెరుగన్నం తప్ప కనీసం చిటికెడు పంచదారన్నా వెయ్యలా.

నా మేనమామలు అత్తయ్యలూ ఎప్పుడోగానీ రారు గనక వారి ముఖారవిందాలు నాకు పెద్దగా జ్ఞాపకం లేవు. మా అమ్మమ్మ తాతయ్యా నాకు రెండేళ్ళప్పుడో మూడేళ్ళప్పుడో వచ్చారు గనక వాళ్ళు అసలు జ్ఞాపకం లేరు.

పాపం, మా నాన్న ఒక్కడే కొడుకుట, మా బామ్మకి తాతయ్యకీ! మా నాన్న 'ప్లీడరీ' చదివేటప్పుడే మా తాతయ్య పోయాట్ట. ఇహ బామ్మగారేమో మా నాన్నకి పెళ్ళైన ఆర్నెల్లల్లోనే 'కాలం' చేసిందిట. మా అమ్మకి మాత్రం బోలెడంతమంది చుట్టాలు. ఇదేం న్యాయం?

హఠాత్తుగా, "మధ్యాహ్నం ఇంటికి రండి!" అని మా అమ్మ నాన్నతో అన్నమాట జ్ఞాపకం వచ్చింది. ఇంకేం. 'తిండి' బెల్లు కొట్టంగానే నా కేరేజీ మొత్తం ముత్యాలోడికి ఇచ్చి నేను కోర్టుకి పరిగెత్తా.

"ఏమిటీ ఇప్పుడొచ్చావ్?" అన్నాడు మా నాన్న.

"అమ్మ మధ్యాహ్నం నిన్ను ఇంటికి రమ్మందిగా? నేనూ వస్తా!" అని కాస్త మారాం చేశాను.

"సాయంత్రందాకా కుదరదే కేసుందీ!" అన్నాడు మా నాన్న.

"మరీ.. మరి నా కేరేజీ ముత్యాలోడికిచ్చి తినమన్నా.!" విషయం వివరించా..

"అదా! దానికేం!" అంటూ నన్ను కిష్టయ్య హోటల్‌కి తీసికెళ్ళి, "మా అమ్మాయి కిష్టయ్యా.. ఏం కావాలో ఇవ్వు.. నేను కేసు అయి బయటికొచ్చాక డబ్బులిస్తా!" అని మానాన్న అన్నాడు. ఆహా ఏమి నా భాగ్యం. ఒక పెసరట్టుప్మా (బేడా అర్ధణా) ఒక వేడి వేడి ప్లేటు పూరీ (అణాన్నర) మరియూ నాలుగు మిర్చి బజ్జీ (అణా)తో మహారాణీలా టిఫిన్ లాగించి చల్లని మంచినీళ్ళు బిగించా.

ఇంటికెళ్ళినా ఇంతటి సూపర్ టిఫిను లభిస్తుందా? రాయల్‌గా నడుస్తూ క్లాస్‌కెళ్ళా.

"కేరేజీ మొత్తం ఖాళీచేసేశానే సీతా.. నీకు తిండి ఎలాగూ?" నన్ను చూడగానే ఖంగారుగా అన్నాడు ముత్యాలోడు.

"మనికేంటిరా సత్తినాణా.. బ్రహ్మాండంగా అయిదణాల టిఫిన్ బిగించా.! మాహా సుష్టుగా వుంది.! అయితేరొరేయ్.. కేరేజీ మాత్రం బాగా కడుగు! వాడికి పని వొప్పజెప్పి బెంచిమీద కూర్చున్నా. చెప్పొద్దూ.. క్రిష్టయ్య పెసరట్టుప్మాకి తిరుగులేదు. దాంతోనే కడుపు నిండినా, ఇంటికి వెళ్ళిన వెంటనే తిండి తినకండా కాస్త అలకసాగించాలిగనక, పూరీ బజ్జీలూ కూడా బిగించా. ఇవాళ మా అమ్మ మీద కచ్చ తీర్చుకోకపోతే నేను 'కామ్రేడ్'నే కాను. లేకపోతే వాళ్ళవాళ్ళ కోస విధ విధాలుగా పిండివంటలు చెయ్యాలని నాకు ఆవకాయన్నం పెరుగన్నం పడేస్తుందా? భాగ్యం.! చూస్కో నా తడాఖా!" అనుకుంటూ నిద్దర్లోకి జారుకున్నా.

కామ్రేడ్ జయలక్ష్మి గట్టిగా చేతిమీద గిల్లితేగానీ నాకు మెలుకువ రాలా. చూస్తే ఎదురుగా పురుషోత్తం మాస్టారు. ఆయన్నిగానీ వీరన్న మాస్టార్నిగానీ చూస్తే మా పిల్లలకి ఒణుకు! అలాగని వాళ్ళేమీ చెడ్డవాళ్ళుగాదు. శ్రద్ధగా విన్నన్నాళ్ళూ వాళ్ళంత మంచివాళ్ళు లోకంలో వుండరు. మనం గనక కాస్త అజాగ్రత్తతో 'తేడా' చేస్తే అంతే సంగతులు.

"ఏమిటి? క్లాసులో నిద్రపోవటానికా వచ్చింది?" బెత్తం నాకు కనిపించేట్టు పట్టుకుని కోపంగా అడిగారు పురుషోత్తం మాస్టారు.

"లేదండీ.. కళ్ళు తిరుగుతున్నై!" నీరసాన్ని నటిస్తూ అని, ఢబాల్న బెంచీమీద కూర్చుని తలని డెస్కు మీదకి వాల్చాను.

మాస్టారు ఖంగారుపడి గబగబా కుండలో నీళ్ళు తెప్పించి నా మొహం మీద జల్లారు. నేను మెల్లగా నీరసంగా కళ్ళు విప్పాను. (ఇవన్నీ సినిమాల్లో చూసి ఎప్పుడో ప్రాక్టీసు చేసి రెడీగా ఉంచుకుంటాంగదా!)

"సరే సరే.. జయలక్ష్మీ.. సీతని ఇంటిదగ్గర దింపు!" అన్నారు. ఇద్దరం సంచీలు పట్టుకుని లేచాం. నేను నీరసంగా అడుగులు వేస్తూ గేటు దాటాను. ఎందుకంటే మా క్లాసురూం నించి స్కూలు మెయిన్ గేటు క్లియర్‌గా కనిపిస్తుంది. ఒకవేళ నడకలో ఏ మాత్రం తేడా వొచ్చినా పురుషోత్తం మాస్టారు వెనక్కి పిలిచి, బాగా బెత్తంతో సత్కరించి, నిజాన్ని రాబడతారని తెలుసు.

"అది కాదే! ఇందాక హుషారుగానే వున్నావుగా? నీరసం ఎట్లా వచ్చిందే ఇంతలో?" పెద్ద పెద్ద కళ్ళని విప్పి ఆశ్చర్యంగా అన్నది జయలక్ష్మి. "తెలీదే. ఓహ్.. ఇంకా కళ్ళు తిరుగుతున్నాయే!" అని దాని చెయ్యి పట్టుకుని, నా భుజం మీద వున్న సంచీ దాని చేతే మోయిస్తూ మా ఇంటిదాకా తెగ యాక్టింగు చేస్తూ నడిచా. అంతేగాదు, అరుగు మీదే కూలబడి కళ్ళుమూసుకున్నా.

ఇహ చూడండి మహానుభావా.. మా అమ్మగోల, "నన్ను అన్యాయం చేసి వెళ్ళిపోకే సీతా.! పాపిష్టిదాన్ని ఆవకాయ పెట్టి పంపించాగదే సీతా! వెంకటేశ్వర స్వామీ నీకు మూడు కొబ్బరికాయలు కొడతా.. అడివాంజనేయా.. నీకు సింధూరం పూసి ఆకుపూజ చేయిస్తా, అమ్మా రాజరాజేశ్వరీ నీకు పొంగలి నైవేద్యం పెడతా.. నా కూతుర్ని రక్షించడమ్మా!" అంటూ ఏడుపు మొదలెట్టింది.

"ఏం జరిగిందేం జరిగిందీ?" అంటూ ఇరుగూ పొరుగూ వచ్చారు.

"మరండీ.. సీత స్కూల్లో స్పృహ తప్పి పడిపోయిందండీ. మేస్టారు మొహం మీద నీళ్ళు జల్లితేగానీ లేవలేదండీ.. ఇంకానండీ.." అంటూ జయలక్ష్మి చిలవలూ పలవలూ కల్పించి చెప్పింది.

అసలు జయలక్ష్మిని 'తోడు' పంపమని మాస్టార్ని అడిగింది అందుకే. అది 'పావలా' విషయాన్నీ 'పదహారు రూపాయలుగా' వర్ణించగలదు. అదీ గోడ కట్టినట్టు. మళ్ళీ నేను మెల్లగా కళ్ళు తెరిచా. (అప్పటికే మా అమ్మ పక్కింటి వాళ్ళ సలహా మీద డాక్టర్‌కి కబురు పెట్టడానికి సిద్ధం అయిపోయింది. లేటు చేస్తే అనవసరంగా చేదు బిళ్ళలు మింగటమేకాక ఇంజక్షన్లు కూడా పొడిపించుకోవాల్సి వస్తుంది)

"ఎలా వుందే సీతా? నువ్వెలావున్నావే సీతా?" అని అమ్మ నన్ను కావలించుకుని ఆదుర్దాగా అడిగింది.

"ఫరవాలేదే అమ్మా.! ఇప్పుడు బాగానే వుంది.! కళ్ళు తిరగటం కూడా ఆగింది." అంటూ మెల్లగా లేచాను. ఆ తరువాత సపర్యలు చేయించుకున్నా చూడండీ.! ఓహ్. అప్పటిదాకా నా 'కచ్చ' తీరలా. క్రామేడ్ సీతా మజాకానా?

రాత్రి మా నాన్న సీక్రెట్‌గా అడిగాడు, "కిష్టయ్య హోటల్లో తిన్నదేమైనా తేడా చేసిందా?" అని. "అంతా ఉత్తిదే నాన్నా.! క్రిష్టయ్య హోటల్ టాప్!" అని మా నాన్నతో అసలు సంగతి చెప్పేశా. గట్టిగా నవ్వితే మా అమ్మతో గొడవొస్తుందని మా నాన్న నిశ్శబ్దంగా తెగనవ్వాడు.

అన్నట్టు ఆ రోజు రావాల్సిన చుట్టాలు చిన్న తిరపతిలో 'నిద్రచేసి' మరుసటిరోజున పొద్దున్నే మా ఇంట్లో దిగారు మనకి 'నీరసం' గనక బడికి ఎగ్గొట్టామని వేరే చెప్పక్కర్లేదు కదా!

మా పెద్దమామయ పేరు సూర్యనారాయణ. ధర్మరాజు టైపు. బట్టల వ్యాపారం. అంటే బట్టలు హోల్‌సేల్‌న తెచ్చి రిటైల్ వాళ్ళకి అమ్మడం. అంతేగాక ఆయనకి ఓ పెద్దకొట్టు కూడా వున్నది. చాలా నిజాయితీపరుడు గనక షాపు బాగా ప్రసిద్ధి చెందింది. పెద్దత్తయ్యపేరు సుభద్రమ్మ. ఆవిడో పిచ్చిమాలోకం. సత్యకాలపు మనిషి. అయితే శుభ్రం ఎక్కువ. వంటలో 'యమ్‌డెన్'. (ఇవన్నీ మా పెద్దత్త గురించి మా అమ్మ చెప్పే మాటలు.)

"ఇట్టారావే సీతా.. అచ్చు మా భాగ్యంలాగే వున్నావు!" నవ్వుతూ నన్ను చూడగానే దగ్గరికి పిలిచాడు మా పెద్దమావయ్య. వెళ్ళాను. మంచి సిల్కుబట్టల పేకెట్టు నాకిచ్చి, "చూసి చెప్పమ్మా నచ్చాయో లేదో" అన్నాడు.

"ఎందుకు నచ్చవూ? అయినా దానికేం తెలుస్తుంది అన్నయ్యా!" అన్నది మా అమ్మ.

"వాళ్ళకీ నచ్చాలిగదమ్మా.! పైగా హైస్కూలు పిల్లాయే!" నవ్వాడు మామయ్య. ఆ మాటతో ఆయన నాకు నచ్చాడు. మా అమ్మలాగా తన ఇష్టమేసాగాలి అనుకునే టైప్ కాదని అర్థమైంది.

"అట్లా చెప్పు పెద్దమామయ్యా.. మీ చెల్లెలు మహాగట్టిది. అన్నీ తను అనుకున్నట్టుగానే సాగిస్తుంది.!" ఛాన్సు దొరికిందికదా అని కంప్లైంటు చెప్పేశాను. తరవాత 'తలంటు' ఎలాగూ తప్పదుగదా.

"అహ్హహ్హ" అని గట్టిగా నవ్వాడు మామయ్య, "నీ కూతురిదీ నీపోలికేనే. చిన్నప్పుడు మావయ్యొస్తే అమ్మమీద నువ్వూ ఇట్లాగే కంప్లైంటు చేసేదానివి!" అంటూ.

"అంటే మా అమ్మకూడా అల్లరిచేసేదా మావయ్యా నాలాగా? అడిగాను.

"ఏం? ఎందుకు చెయ్యలా?"

"మరి అసలు అల్లరే చేసేదాన్నికాదనీ, ఎంతో బుద్ధిమంతురాల్ననీ నాకు మహా సుద్దులు చెబుతుందే!"

"నోరుముయ్యవే సిగ్గులేనిదానా.. ఫో.. ఇంట్లోకి ఫో.!" తను గుట్టంతా రట్టు అయినందుకు మా అమ్మ కొంచెం బిడియంగా కొంచెం కోపంగా అన్నది. మా పెద్ద మావయ్యకి ఫుల్ మార్కులు ఇచ్చేశా.. మా అమ్మ సీక్రెట్లు విప్పేసినందుకు.

"నువ్వుత్తి దొంగవిట కదా!" నాకంటే కాస్త పొడుగ్గా వున్న మా మావయ్య కొడుకు వాసు ఏమాత్రం మర్యాద లేకుండా నన్నడిగాడు.

"మరోసారి నన్ను 'దొంగ' అంటే మర్యాద దక్కదు. ఏం చేస్తానో నాకే తెలీదు!" వాడివంక కోపంగా చూసి లోపలికి పోయా.

మిగతా వాళ్ళంతా పలకరించారుగాని, వాసుగాడు వాళ్ళ నాన్న ముందర నన్ను దొంగా అనటం సహించలేకపోయా.

మా రెండో మావయ్య పేరు శ్రీమన్నారాయణ. చాలా మంచివాడు. ఆయన కాలేజీలో లెక్చరరుట. ఎక్కువ మాట్లాడ్డుగానీ, మాట్లాడే నాలుగు ముక్కలు ప్రేమగా దయగా మాట్లాడతాడు. రెండో అత్తయ్య పేరు శ్రీలక్ష్మి. బాగా చదువుకున్నది. ఎప్పుడూ డిసిప్లిన్ డిసిప్లిన్ అంటుంది. వాళ్ళకి ఇద్దరమ్మాయిలు నీరజ నీహారిక. వాళ్ళూ మౌనం టైపే.

మూడో మామయ్య పేరు సత్యనారాయణ. అత్తయ్య పేరు భద్రావతి. కొంచెం హెచ్చులు ఎక్కువ. "ఈ చీర ఖరీదూ, మూడువందలు.! ఇంతకంటే తక్కువ రేట్లో కొంటే మా అమ్మా నాన్నా ఊరుకోరు." ఇలా మాట్లాడుతుంది. ఆ రోజుల్లో పాతిక రూపాయలు పెట్టి చీరకొనటమే ఘనం. ఇహమూడు వందల రూపాయల చీరెక్కడిదీ.. అచ్చు మా రెండో సీతలాంటిదే ఈవిడ. ఒక్కతే కూతురు భార్గవి. అది మాత్రం మహా ఉత్సాహంగా పరుగులు తీస్తూ వుంటుంది. మొత్తం అందరిలోకీ నాకు నచ్చని వాళ్ళు వాసూగాడూ మూడో అత్త భద్రావతి. మిగతా వాళ్ళంతా ఓ.కే.

వాళ్ళున్న రెండురోజుల్లోనూ నా గురించి ఎంత 'ప్రచారం' చెయ్యాలో అంతా చేసింది మా అమ్మ. నాగేదె సవారీ గురించీ, వెలక్కాయల గురించీ కూడా వదిలిపెట్టలా. ఎంత తల్లయినా కూతురి పరువు తియ్యటం ఏమన్నా బాగుందా? రేపు గనక నేను తల్లినైతే, నా కూతురి పరువు కల్లోనయినా తియ్యగలనా?

"గూగూగూగూ గుమ్మడిచెక్క

బాబాబీబీ బాదం మొక్క

సుబ్బడి గుళ్ళో ముత్యాలక్కా

దాటేసిందోయ్ వెయ్యికి లెక్క" అంటూ గంతులేస్తుంటే నావంక అసూయగా చూశారు మా పాకబడి బేచ్. కారణం నేను 'వెయ్యీశ్వరి' నయ్యాను. ఇదేమిటా అనకండి. 'కోటి' ఉంటే కోటీశ్వరుడు.. మన దగ్గర 'వెయ్యి' వుంది గనక నేను వెయ్యీశ్వరిని వెయ్యి అంటే వెయ్యి రూపాయలు కాదు. వెయ్యికి సరిపోయేంత సిగరెట్టు డొక్కులు. ఖాళీ డొక్కుల్తో మనం బెచ్చాలు ఆడుతాం గదా! డొక్కుని బట్టిదాని విలువ వుంటుందిగదా? ఒక్క విల్సు డొక్కు విలువ = పది చార్‌మినార్ డొక్కులు. చార్‌మినార్ పెట్టె విలువ ఒకటి. పేసింగ్ షో = 2 చార్‌మినార్లు. డక్కన్ పెట్టె విలువ. మూడు చార్‌మినార్లు. సిజర్సు పెట్టె = 5 చార్‌మినార్లు. ఇంకేదైనా సరికొత్త బ్రాండుంటే దాని విలువని అందరం కూర్చుని నిర్ణయిస్తామన్నమాట. అన్నట్టు బర్కిలీ పెట్టె విలువకూడా అయిదే.

పొద్దున్నే నా పంట పండింది. ఫిలిం ముక్కలు ఏరుకుందామని తెల్లకి తెల్లవారు ఝామున టూరింగ్ టాకీస్‌కి వెడితే మూడు విల్సు డొక్కులూ, రెండు సిజర్సు పెట్టెలూ, ఆరు చార్‌మినార్లూ, ఒక పేసింగ్ షో దొరికాయి. మొత్తం లెక్కకడితే నా దగ్గరున్న డొక్కుల విలువ ఒక వెయ్యీ పన్నెండు అయింది. పిల్లల ఆస్తి అంటే ఫిలిం ముక్కలూ, సిగరెట్టు డొక్కులూ, చాక్‌పీసు ముక్కలేగా! ఇంకా గోళీలు కూడా. (అవి దండిగా వున్నాయి)

ఆ వుత్సాహంలో ఆ రోజు బెచ్చాలాట హోరాహోరీగా జరిగింది. ముహోత్సాహంగా ఆడి మరో 'వంద' గెల్చుకున్నాను.

మధ్యలో మేడబడి వాళ్ళొచ్చి ఛాలెంజ్ చేశారు. పాకబడి X మేడబడి పోటీలు జరిగినై. మేడబడి వాళ్ళు చిత్తు చిత్తుగా ఓడిపోయి, "హూ..! ఈ బెచ్చాలాటలో గొప్పేముంది.. దమ్ముంటే మాతో కబాడీ ఆడండి!" అని మరో సవాల్ విసిరారు.

"మాతోనా? మీరా? హూ.! నక్క ఎక్కడ నాగలోకం ఎక్కడా?" అని కాంతారావులా పకపకా నవ్వాడు మెల్ల కళ్ళ పార్వతీశం. వాడ్ని పట్టడం ఎవడికీ సాధ్యంగాదు. ఎందుకంటే వాడు ఎటువైపు చూస్తున్నాడో ఎవడికీ అర్ధంగాదు.

"ప్రగల్భాలు పలకటం కాదురా.. బరిలోకి దిగి సత్తా చూపించు!" తొడగొట్టి అన్నాడు K.D.V.L కాంతారావు. అంటే, కొండపల్లి దివాకర వెంకట లక్ష్మీ కాంతారావన్నమాట.

"ఒరేయ్ దివాయ్.! తినబోతూ రుచులెందుకురా.! బస్తీమే సవాల్!" అని జోగారావూ భీకరంగా రెండు తొడలూ కొట్టాడు. మరి రిఫరీ కావాలిగదా?

ముత్యాలోడు పరిగెత్తుకెళ్ళి చిన్న చెరువు దగ్గరుండే నల్లమోతు పాండురంగడ్ని తీసుకొచ్చాడు. వాడ్ని N.P.R.M అంటారు. వాడు సెకండ్‌ఫాం వాడు.

బండి వాళ్ళ మావిడితోట దగ్గరకి బయల్దేరాం అందరం. నేను మాట్లాడకుండా దివాయ్‌గాడి నెత్తిమీద చేతులు వేసి, "ఇక్కడేదో చిక్కుకుందిరా.. తీస్తానుండు!" అంటూ వాడి నెత్తిమీది నూనెని నా చేతులకి అంటించుకుని, "ఛీ.. ఇంత నూనె రాసుకున్నావేమిట్రా?" అని చికాకు పడ్డట్టు నటించి ఆ నూనెని నా కాళ్ళకీ చేతులకీ పట్టించాను.

"అదిగాదే! నూనె రాయకపోతే జుట్టూడిపోతుందిట. అందుకే మా బామ్మ వద్దన్నా తెగ నూనెరాస్తుంది" అని కాస్త సిగ్గుపడ్డాడనుకోండీ.

మావిడి తోట దగ్గరికెందుకంటే, ఇల్లు కట్టించుకోడానికి కంసాలి సీతారామయ్యగారు తళతళలాడే తమ్మిలేటి ఇసకని బళ్ళకొద్దీ తోలించాడని మాకు తెలుసు. ఆ ఇసకని కోతిమూకలాగా మేం చదును చేసి 'కోర్టుని' తయారుచెయ్యడం క్షణాల్లో జరిగిపోయింది.

పోటీ మొదలైంది.. 'బెస్ట్ ఆఫ్ త్రీ' అనగా మూడు గేములు ఆడాలి. ఎవరైతే రెండు గెలుచుకుంటారో వాళ్ళు విన్నర్లు. ఓడిన వాళ్ళు 20 గోలీలూ, 200 సిగరెట్టు డొక్కులూ, 25 ఫిలిం ముక్కలూ 'కప్పం' కింద సమర్పించుకోవాలని నిర్ణయించాం.

మొదటి కూత ఎవరిదో ఎలాగా తేలడం? ఎవరి దగ్గరా రెడీగా డబ్బులు లేవు కదా 'టాస్' వెయ్యడానికి.

"ఈ సిగరెట్టు డొక్కులో రాయిపెట్టి పైకెగరేద్దాం." అన్నాను.

"బొమ్మ బొరుసూ ఎలా తెలుస్తె?" కొచ్చినేశాడు మేడబడి నాగరాజు.

"ఒకవైపు దానికి నూనె రాద్దాం!" అని నేను డొక్కుని దివాయ్ గాడి తలమీద రుద్ది, రాయిపెట్టి పైకెగరేశా.

కూత మాదే ముందే చెప్పానుగదా మేం దొంగకూతలో ఘనాపాఠీలమని. అంతేగాదు.. డొంకాడ వాడు 'కత్తెరపట్టు' పట్టడంలో మహానేర్పరి. అరగంట సాగిన మొదటి మేచ్‌లో గెలుపు మాదే

రెండోసారి 'కూత' ఓడిన వాళ్ళకే పోతుంది. కూతకొచ్చిన నాగరాజుగాడ్ని మధుగాడు చుట్టుకుంటే డొంకాడగాడు వాడికాళ్ళ మధ్య కాళ్ళు పెట్టి బ్రేకేసి కిందపడేశాడు. పాయింట్ పాకబడిదే

నేను కూతకెళ్ళి. నన్ను పట్టుకున్నారుగానీ చేతులకీ కాళ్ళకీ నూనె వుండటం వల్ల వాళ్ళ చేతుల్లోంచి జారి బరిమీద పడ్డా. నేను పెట్టిందీ దొంగకూతే అని చెప్పక్కర్లేదుగా.

"ఇది అన్యాయం.. సీత నూనె పూసుకొచ్చింది!" ఆట ఆపి రిఫరీకి కంప్లైంటు చేశాడు మేడబడి క్రిష్ణారెడ్డి.

"నా తలమీద ఒక్క చుక్క నూనె వుందా?" నా జుట్టు చూపించా.

"తలమీద లేదు.. చేతులకీ కాళ్ళకీ వుంది!" అరిచాడు క్రిష్ణారెడ్డి.

"అది దివాయ్‌గాడి తలమీదనించి ఏదో పురుగుని తీసేటప్పుడు అంటుకున్నది.. కావాలంటే దివాయ్‌గాడ్నే అడుగు!" నేనూ అరిచా.

"అవ్వునా రెడ్డీ.. ఇందాక నా తలమీద ఏదోవుంటే పాపం సీత తీసిందిరా!" సిన్సియర్‌గా ఒప్పుకున్నాడు దివాయ్. కంప్లైంట్ కేన్సిల్.

ఆ తరవాత దివాయ్‌ని పట్టుకున్నప్పుడల్లా మావాళ్ళు వాడినెత్తిమీద చేతులు రుద్ది నూనె అంటించుకున్నారనేది వేరే విషయం.

సెకెండ్ గేమ్ కూడా పాకబడే గెల్చుకుంది.

"మూడోదాన్లో మేమేంటో చూపిస్తాం" తొడగొట్టాడు వంకాయలపాటివాడు.

"పోరా వంకాయ్.! రెండు గేములూ గెల్చేశాం.. చచ్చినట్టు కప్పం చెల్లించండి డిక్లేర్ చేశాం. N.P.R.M గాడు కూడా మాకే సపోర్టిచ్చాడు. "

బట్వాడా జరిగింది.. ఒక్క ఫిలిం ముక్కలు తప్ప.

ఈలోగా "ఎదవల్లారా.. బంగారంలాంటి ఇసక్కుప్పల్ని నేలపాలు చేస్తార్రంట్రా" అని ప్రళయరుద్రుళ్ళా మావేపు కొచ్చాడు కంసాలి సీతారామయ్య.. పాలేళ్ళతో సహా.

అంతే.! ఎక్కడివాళ్ళం అక్కడికి పరిగెత్తాం. చిన్న చిన్న కంచెల్ని కూడా లెక్కచెయ్యకుండా. పట్టుబడ్డ జోగ్గాడికీ దివాయ్‌కీ 'మర్యాద' బాగా జరిగిందనుకోండి.

ఇంటికెళ్ళాక నాకూ 'తలంటీ' 'తాషామర్వా' లేటుగా జరిగాయి. కంచె దూకేటప్పుడు గౌను చిరిగిందని చూస్కోలేదు. అదీ మామూలు గౌనుకాదు. మా నాయన ప్రత్యేకంగా నాకోసం కొనుక్కొచ్చిన నైలాన్‌గౌను.

సాయంకాలం నా 'అలక' తీరకముందే మరో విడత 'తలంటి' పోసింది మా అమ్మ. కారణం, "ఏవమ్మా? ఆ అల్లరి వెధవల్తో చేరి మీ అమ్ములు మా ఇసగ్గుట్టల్ని సర్వనాశనం చేసింది. మొగాళ్ళతో పాటు తగుదునమ్మా అని మీ అమ్ములు కబడ్డీ ఆడుతూంటే ఎలా వూరుకుంటారమ్మా. అదే నా కూతురైతేనా కాళ్ళు విరగ్గొట్టి గాడి పొయ్యిలో పెట్టేవాడిని!" అని కంసాలాయన మా అమ్మకి పురెక్కించినందుకు.

అసలు విషయం ఏమంటే, "ఉన్నదీ పోయింది ఉంచుకున్నదీ పోయింది" అని పెద్దవాళ్ళు వాడే సామెతలాగా, పొద్దున తెచ్చుకున్న డొక్కులేగాక గెలిచి పంచుకున్న డొక్కులు కూడా ఆ గొడవలో (కలెక్టు చేయడం కుదరకపోవడం) వల్ల పోయాయి. అంటే ఎవడో చులాగ్గా ఏ కష్టమూ పడకండా వాటిని దక్కించుకున్నాడన్నమాట. అయితే ఏం? మళ్ళీ పోటీలు జరక్కపోతయ్యా డొక్కులూ గోళీలూ బైటికి రాకమానుతయ్యా?

"అలా ఇక తిట్లు తినకే సీతా! ప్లీడరుగారమ్మాయి బరితెగించి, మగాళ్ళతో ఆటలాడుతోందంటే నాకెంత అప్రదిష్ట!" అంటూ రాత్రి నన్ను బుజ్జగించే ప్రయత్నం మా అమ్మ చేసిందనుకోండీ!

*(మళ్ళీకలుద్దాం)*

Post your comments